క్లుప్తంగా

రామాలయ నిర్మాణానికి భూమి పూజ


శంకుస్థాపన చేస్తున్న సంజీవ్‌నాయక్

ఇల్లెందురూరల్: చల్లసముద్రం గ్రామపంచాయతీ ముకుందాపురం గ్రామంలో శనివారం పండుగ వాతావరణం నెలకొంది. గ్రామంలో నూతనంగా రామాలయం, ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రామంలో ప్రతి ఇంటికి మామిడి తోరణాలు కట్టుకొని ప్రదర్శనగా భూమి పూజ వద్దకు చేరుకున్నారు. ముఖ్యఅతిథిగా సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు సంజీవ్‌నాయక్ హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం ప్రకటించారు.

ఎల్‌ఓసీ చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

టేకులపల్లి: సులానగర్ గ్రామానికి చెందిన కర్లపూడి సుందరం రాజమణి దంపతుల కుమారుడు రాహుల్ అనారోగ్యం కారణంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే హరిప్రియ గతంలోనే రూ.3లక్షల ఎల్‌ఓసీ అందజేసి సహకరించారు. వైద్యం అనంతరం కూడా రాహుల్ ఆరోగ్యం మెరుగు పడకపోవడంతో స్పందించిన ఎమ్మెల్యే వైద్య ఖర్చుల కోసం మరోసారి శనివారం రూ.3లక్షల ఎల్‌ఓసీ చెక్కుని రాహుల్ కుటుంబ సభ్యులకు అందజేశారు.

సోలార్ ప్లాంట్ తనిఖీ


ప్లాంట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఇల్లెందురూరల్: సింగరేణి ఇల్లెందు ఏరియాలో నిర్మించిన 39 మెగావాట్స్ సోలార్ పవర్ ప్లాంట్ వార్షిక తనిఖీల్లో భాగంగా చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ తెలంగాణ శ్రీనివాస్, బృందం శనివారం సోలార్ ప్లాంట్‌లో తనిఖీలు నిర్వహించారు. ఇన్వర్టర్లు, మెయిన్ కంట్రోల్ రూం, బ్యాటరీ బ్యాంక్, గ్రిడ్ కనెక్షన్లు, సోలార్ ప్యానళ్లను పరిశీలించారు. ఆయా విభాగాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఏరియా జీఎం షాలేమురాజు, ఏరియా ఇంజనీర్ ప్రభాకర్‌రావు, ఏజీఎం రాంచందర్, డీజీఎం శేఖర్, డీవైఎస్‌ఈ వీరానాయక్ తదితరులు పాల్గొన్నారు.

అరకొర వేతనాలతో ఇబ్బందులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలోని కార్పొరేట్ సెక్యూరిటీ గార్డుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం బీఎంఎస్ జాతీయ కార్యదర్శి పి.మాధవనాయక్ ఆధ్వర్యంలో సింగరేణి డైరెక్టర్(పా) ఎన్.బలరామ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాధవనాయక్ మాట్లాడుతూ.. సింగరేణి వ్యాప్తంగా పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులకు యూనీఫాం అమలు చేయాలని కోరారు. కాంట్రాక్టర్ మారినప్పుడల్లా గార్డులకు యూనిఫాం కింద రూ. 4 వేలు ఖర్చు అవుతోందని, గార్డులకు వచ్చే అరకొర వేతనాలతో ఆర్థిక ఇబ్బందులవుతున్నాయని తెలిపారు. సానుకూలంగా స్పందించిన డైరెక్టర్ ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్, ప్రభాకర్‌రావు, ఏరియా ఉపాధ్యక్షుడు మొగిలిపాక రవి, ఊట్ల గణేష్, క్రాంతికుమార్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

సెర్ప్ ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక


సెర్ప్ ఉద్యోగుల కమిటీ సభ్యులు

చుంచుపల్లి: కొత్తగూడెం మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో శనివారం తెలంగాణ గ్రామీణాభివృద్ధి ఉద్యోగుల సంక్షేమ సంఘం (సెర్ప్) జిల్లా స్థాయి సమావేశంలో జిల్లా స్థాయి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బచ్చలకూరి ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మిశెట్టి రామారావు, కోశాధికారిగా చిట్టిమళ్ల రాంబాబు, ఉపాధ్యక్షురాలుగా వేమూరి ప్రభావతి, సహాయ కార్యదర్శిగా చిర్నేని సత్తిబాబు, సలహాదారులుగా రెంటాల ఉపేందర్, కంభంపాటి నర్సింహారావు గోళ్ల వెంకటేశ్వరరావు ఎంపికయ్యారు.

కలగానే బైపాస్ రహదారి

- ఏళ్లుగా నిలిచిన నిర్మాణ పనులు
- పట్టించుకోని అధికారులు
- ట్రాఫిక్‌తో కొత్తగూడెం సతమతం


మధ్యలో నిలిచిపోయిన కొత్తగూడెం- పాల్వంచ బైపాస్ రహదారి

చుంచుపల్లి: కొత్తగూడెం- పాల్వంచ మధ్య బైపాస్ రోడ్డు కలగానే మిగిలింది. జంట నగరాలుగా పేరొందిన కొత్తగూడెం, పాల్వంచలను కలుపుతూ ట్రాఫిక్ సమస్యను నివారించాలనే ఉద్దేశంతో 2014లో రూ.33 కోట్ల అంచనాలతో అధికారులు కొత్తగూడెం బైపాస్ రహదారి పనులకు శ్రీకారం చుట్టారు. మొదట్లో పనులు చకచకా జరిగినప్పటికీ ఆ తర్వాత నత్తనడకతో చివరకు మధ్యలోనే నిలిచిపోయాయి. ప్రస్తుతం మిగిలిపోయిన బైపాస్ రహదారి నిర్మాణ పనుల ఆలనా పాలన చూసే నాథుడే కరువయ్యాడు. కొత్తగూడెం బైపాస్ రహదారి ఏర్పాటు వల్ల ప్రధానంగా ట్రాఫిక్ సమస్య తీరనుంది. అయితే గత ఎనిమిదేళ్లుగా నిధులతో పాటు వివిధ కారణాలతో బైపాస్ నిర్మాణం ముందుకు సాగడం లేదు. అయితే ఇప్పటి వరకు కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు చేసినట్లు అధికారులు చెపుతున్నారు. బైపాస్ రహదారిపై ఫ్లైఓవర్‌తో పాటు మరికొన్ని నిర్మాణాలకు మరో రూ.75 కోట్ల నిధులను కేటాయిండంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. నిధుల కొరత వల్లనే మూడేళ్లుగా బైపాస్ పనులకు మోక్షం కలగడం లేదు. వీటి విషయంలో ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కావాల్సి ఉంది. బైపాస్ నిర్మాణం విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులు సైతం పట్టించుకోకపోవడంతో దీని పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. ఈ బైపాస్ రహదారి పనులను విద్యానగర్, ఎన్‌కే నగర్, బాబూక్యాంప్, పెనుబల్లి, గంగబిషన్ బస్తీ, పాత కొత్తగూడెం మీదుగా నవభారత్ వరకు పూర్తి చేయాల్సి ఉంది. ఈ ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందుతున్నాయనే ఉద్దేశంతో రైతులు అప్పట్లో భూములు ఇచ్చేందుకు ముందుకొచ్చారు. బైపాస్ రహదారి నిర్మాణం కోసం చాలామంది రైతులు తక్కువ ధరలకే తమ వ్యవసాయ భూములను ఇచ్చారు. ఎనిమిదేళ్లు దాటినా బైపాస్ రహదారి నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. ఎప్పుడు పూర్తి చేస్తారో అధికారులకు కూడా తెలియని పరిస్థితి నెలకొంది. బైపాస్ అందుబాటులోకి రాకపోవడంతో ప్రతిరోజూ వందలాది వాహనాలు కొత్తగూడెం పట్టణం మీదుగానే పాల్వంచ వెళ్తున్నాయి. దీంతో కొత్తగూడెం పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటోంది. ఉదయం, రాత్రి 10 గంటల తర్వాత వందల కొద్ది లారీలు, భారీ వాహనాలు పట్టణం మీద నుంచి వెళుతున్నాయి. వాహనాల రద్దీ అధికంగా ఉండటంతో ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి బైపాస్ రహదారి నిర్మాణ పనులను చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. కొత్తగూడెం- పాల్వంచ బైపాస్ రహదారి విషయంలో ఆర్‌అండ్‌బీ ఏఈను సంప్రదించగా.. బైపాస్ ఫ్లైఓవర్‌తో పాటు మిగిలిన పనుల నిమిత్తం ప్రభుత్వానికి మరో రూ.75 కోట్ల ప్రతిపాదనలు పంపామని, ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే పనులు పూర్తి చేస్తామని చెప్పారు.

బైపాస్ పూర్తి చేయాలి



ఎన్నో ఏళ్లుగా ఆశగా ఎదురు చూస్తున్న బైపాస్ రోడ్డు పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. బైపాస్ అందుబాటులోకి వస్తే కొత్తగూడెం వెళ్లకుండానే విద్యానగర్ నుంచి నేరుగా పాల్వంచకు వెళ్లవచ్చు. అంతేకాకుండా విద్యానగర్ నుంచి పాల్వంచ నవభారత్ వరకు ఉన్న ప్రాంతాలు, గ్రామాలు అభివృద్ధి చెందుతాయి.

– బానోత్ హరికుమార్, విద్యానగర్

పలు గ్రామాలకు ప్రయోజనం



చుంచుపల్లి, విద్యానగర్ నుంచి నవభారత్ వరకు ఏర్పాటు చేయనున్న బైపాస్ రహదారి వల్ల పలు గ్రామాలకు ప్రయోజనంగా ఉంటుంది. ఏళ్ల తరబడి పనులు ముందుకు సాగడం లేదు. కొత్తగూడెం-పాల్వంచ బైపాస్ పక్కన ఉండే పెనుబల్లితో పాటు అనేక గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. అధికారులు స్పందించాలి.

– రెడ్డి శ్రీనివాస్, పెనుబల్లి సర్పంచ్

రేవంత్‌రెడ్డివి పగటి కలలు


మాట్లాడుతున్న రంగనాథ్

ఇల్లెందు: అధికారులను జైలుపాలు చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదేనని, అలాంటిది అభివృద్ధి కోసం అహర్నిషలు పాటుపడుతున్న ఎమ్మెల్యే హరిప్రియను విమర్శించటం విడ్డూరంగా ఉందని టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఎస్ రంగనాథ్ అన్నారు. శనివారం జేకే ఓసీలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే హరిప్రియ ఎన్నికకు ముందు, ఎన్నిక తర్వాత ఇల్లెందు ఎలా ఉందో చూడాలని హితవు పలికారు. ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మితో సింగరేణి సీఎండీ శ్రీధర్‌ను పోల్చటం సబబు కాదన్నారు. బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి అగ్రస్థానంలో ఉందన్నారు. టీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణిలో ఎన్నో పథకాలు అమలు చేసినట్లు తెలిపారు. మరో పది నెలల్లో కాంగ్రెస్ అధి కారంలోకి వస్తుందని రేవంత్‌రెడ్డి పగటి కలలు కంటున్నాడని ఎద్దేవా చేశారు. సంజీవరావు, రమేష్‌బాబు, రాజయ్య, రవీంద్రబాబు, రాజ్‌కుమార్, వెంకటేశ్వర్లు, ఆనంద్ మగ్బూల్, మహబూబ్‌అలీ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై అవగాహన


నార సంచులు ప్రదర్శిస్తున్న అధికారులు

ఇల్లెందురూరల్: సింగరేణి ఏరియాలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా శనివారం ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై జీఎం కార్యాలయంలో అవగాహన సమావేశం నిర్వహించారు. జీఎం షాలేమురాజు మాట్లాడుతూ.. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం వలన కలిగే అనర్థాల గురించి వివరించారు. కాలనీల్లో ప్లాస్టిక్ వాడకుండా చర్యలు తీసుకోవాలని, ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైక్లింగ్ చేయడం ద్వారా అనర్థాలను తొలగించవచ్చన్నారు. వీలైనంత వరకు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకోవాలని సూచించారు. కార్మికులకు నార సంచులను పంపిణీ చేశారు. ఎస్‌ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య, అధికారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, ఏజీఎం ప్రభాకర్, ఏఈఎం గిరిధర్‌రావు, డీజీఎం పర్సనల్ మోహన్‌రావు, డీజీఎం శేఖర్‌బాబు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

టేకులపల్లి: గ్రామీణ క్రీడలకు ప్రభుత్వం మరింత ప్రోత్సాహం ఇవ్వాలని, గ్రామీణ ప్రాంతాల్లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, క్రికెట్ తదితర క్రీడల్లో నైపుణ్యం ఉన్నవారు చాలామంది ఉన్నారని వారిని వెలికి తీసి దేశానికి అందించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్యా సంజీవ్ నాయక్ అన్నారు. శనివారం టేకులపల్లి మండలం తావుర్యాతండా గ్రామంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. సర్పంచ్ తేజావత్ రమేష్, వీరయ్య, మల్సూర్, మాళోతు శివ నాయక్ పాల్గొన్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే


ఇల్లెందురూరల్: వినతిపత్రం అందజేస్తున్న టీచర్స్ జేఏసీ నేతలు


కొత్తగూడెంరూరల్: రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న ఎడవల్లి కృష్ణ

ఇల్లెందు: టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి హాత్ సే హాత్ జోడో పాదయాత్ర కార్యక్రమంలో భాగంగా ఇల్లెందు విచ్చేసిన సందర్భంగా రాజీవ్‌నగర్ తండా వద్ద ఆయను కలిసిన టీడీపీ నేతలు ఇల్లెందు కేంద్రంగా రెవెన్యూ డివిజన్, కొమరారం, బోడు, సుదిమళ్ల మండలాలను ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. 10 నెలల కాలం ఓపిక పడితే వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్ని సమస్యలు పరిష్కరిస్తామని, రెవెన్యూ డివిజన్ ఏర్పాటు మూడు కొత్త మండలాలను ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ముద్రగడ వంశీ, చాందావత్ రమేష్‌బాబు, నర్సయ్య, శ్యామ్, సల్మాన్, నూక వెంకటేశ్వర్లు, బాబు, కంది రవి, శిల్ప వెంకటేశ్వర్లు, ముత్యాల రమేష్, రాంగోపాల్, రాజేష్, అశోక్, గౌస్, శ్రీవేద్, వినీత్, రాకేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: ఏజెన్సీలో గిరిజనులకు మేలు చేసే జీఓ నంబర్–3 అమలు చేయాలని, నియామకాలు చేపట్టాలని, పదోన్నతులు కల్పించాలని ట్రైబల్ టీచర్స్ యూనియన్ జేఏసీ కోరింది. శనివారం రాజీవ్‌నగర్ తండా వద్ద టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. టీచర్స్ జేఏసీ నేతలు కబ్బాకుల రవి, ఇస్లావత్ లక్ష్మణ్‌నాయక్, కుంజ కృష్ణ, కల్తి భాస్కర్, కొడెం కృష్ణయ్య, ఆరెం లక్ష్మీనారాయణ, రవీందర్‌నాయక్, సత్తులాల్, రవి చౌహాన్, ఆరెం రామకృష్ణ, మోతీరాం, జుంకీలాల్, రాజు, సర్వేశ్వరరావు, వీరస్వామి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: విద్యుత్ శాఖలో పని చేస్తున్న ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా చైర్మన్ జర్పుల రాజేందర్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఇల్లెందులో పర్యటిస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బాణోతు రవి, ఎస్‌కే జానీమియా పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన ఎడవల్లి కృష్ణ

కొత్తగూడెంరూరల్: ఇల్లెందులో శనివారం హాత్ సే హాత్ జోడో యాత్రలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని టీపీసీసీ జనరల్ సెక్రెటరీ ఎడవల్లి కృష్ణ కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాయల శాంతయ్య, బిమ్మిడి మల్లికార్జున్, నూకల రంగారావు, అంతోటి పాల్, పల్లపు వెంకటేశ్వర్లు, చారి, బద్ది కిషోర్, పైడిపల్లి మనోహర్, బత్తుల వెంకటేశ్వరరావు, సారంగపాణి, వేమారెడ్డి తదితరులున్నారు.

దివ్యాంగ జర్నలిస్టులకు ప్రాధాన్యం ఇవ్వండి

కొత్తగూడెంఅర్బన్: ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో సింగరేణి మహిళా కళాశాల ఆడిటోరియంలో విలేకరులకు రెండు రోజుల శిక్షణ తరగతుల కార్యక్రమానికి తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. టీడీపీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, దివ్యాంగవాహిని మాసపత్రిక సంపాదకులు సతీష్ శనివారం అల్లం నారాయణను కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విలేకరులకు కల్పిస్తున్న అన్ని సంక్షేమ పథకాలలో దివ్యాంగులకు ఐదు శాతం కచ్చితంగా అందేలా చూడాలని, అదేవిధంగా చిన్న పత్రికలు నడుపుతూ అనేకమంది విలేకరులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వారికి కూడా అక్రిడిటేషన్‌తో పాటు హెల్త్ కార్డులు, ఇళ్ల స్థలాలు, అందించి ఆదుకోవాలని విన్నవించారు.

పండిట్ దీన్‌దయాళ్‌కు నివాళి


నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

పాల్వంచరూరల్: బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పట్టణంలో శనివారం పండిట్ దీన్‌దయాళ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దీన్‌దయాళ్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి పానిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి యడ్లపల్లి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు ఎం.ప్రభాకర్, రాపాక రమేష్, జైహింద్, ప్రసాద్, కె.రంజిత్, ప్రశాంత్ పాల్గొన్నారు.

మూఢనమ్మకాల వ్యతిరేక చట్టం తేవాలి


మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

కొత్తగూడెంఅర్బన్: సమాజానికి మూఢ నమ్మకాల వ్యతిరేక చట్టం అవసరమని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం జనవిజ్ఞాన వేదిక ప్లీనం సమావేశం కొత్తగూడెంలో జరిగింది. ఆయన మాట్లాడుతూ.. సైన్స్ ప్రాధాన్యం దాని అవసరాన్ని సభ్యులకు వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా కరోనాకు మందు కనుగొనటం సైన్స్ వల్లనే సాధ్యమైందన్నారు. అక్షరాస్యత పెరగడం సంతోషించవలసిన విషయం కానీ అక్షరాస్యత ఎక్కువైనా చోట ఆడపిల్లల సంఖ్య తగ్గడల ప్రమాదకరమన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కస్తూరి, మండలాల బాధ్యులు కొల్లు నాగేశ్వరరావు, ఆనందకుమార్, గంజిబాబు, సభ్యులు మోహనరావు, తిరుపాలు, వీరభద్రం, కామేశ్వరరావు, జాన్సీ, ఈశ్వరయ్య, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని అందరూ గౌరవించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: అంబేడ్కర్‌ని, ఆయన రాసిన రాజ్యాంగాన్ని అవమానపరిచే విధంగా అవహేళన చేస్తూ మాట్లాడిన హమారా ప్రసాద్‌పై రాజద్రోహం కేసు నమోదు చేయాలని దళిత బహుజన సంఘాల ఆధ్వర్యంలో కొత్తగూడెం పట్టణ పోస్టాఫీసు సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు. ప్రసాద్ దిష్టిబొమ్మ దహనం చేశారు. మాట్లాడుతూ మనుస్మృతిని అంబేడ్కర్ తగలబెట్టి భారతదేశంలో ఉన్న అన్నివర్గాల ప్రజలకు ఉపయోగపడేలా రాజ్యాంగాన్ని రచిస్తే దానికి కించపరిచే విధంగా మనువాదులు కొంతమందితో అనుచిత వ్యాఖ్యలు చేయిస్తున్నారని విమర్శించారు. ఆ భావజాలంతో ఎవరైనా మాట్లాడితే సహించబోమని, హమారా ప్రసాద్ చేసిన వ్యాఖ్యలు మనువాద కుట్రలో భాగమేనని, ఇట్టి విషయాన్ని రాజ్యాంగ రక్షణ కోరుకునే ప్రతిఒక్కరూ ఖండించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కూసపాటి శ్రీనివాస్, మారపాక రమేష్, సలిగంటి శ్రీనివాస్, కనకం సూరిబాబు, వేల్పుల భాస్కర్, దలవాడ సూరి, కరిష రత్నకుమారి, భాగ్యమ్మ, రమేష్ నాయక్ పాల్గొన్నారు.

ఆస్పత్రి సిబ్బందికి ప్లేడేలు కల్పించండి


రజాక్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆస్పత్రి సిబ్బంది

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్ సింగరేణి ఆస్పత్రిలో సిబ్బందికి ప్లేడేలు కల్పించాలని ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్‌కు సిబ్బంది వినతిపత్రం అందజేశారు. అత్యవసర విభాగంలో పనిచేస్తున్న సిబ్బందికి ప్లేడే విషయంలో కొర్రీ పెట్టడం సరికాదని, కార్పొరేట్, ఏరియాలలో ఎన్నో మస్టర్లు వృథా అవుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదని, తమ విషయం వచ్చేసరికి అధికారులు పొదుపు చర్యలు పాటించటం భావ్యం కాదని వాపోయారు. ఇప్పటికైనా తమకు ప్లేడేలు కల్పించాలని కోరారు. కరోనా సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి వందలాది ప్రాణాలను కాపాడామని తెలిపారు. సానుకూలంగా స్పందించిన రజాక్ సమస్యలను సింగరేణి ఉన్నతాధికారులకు తెలియపరిచి వీలైనంత త్వరలో పరిష్కార మార్గం చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో డి.గోవర్ధన్, టీఆర్‌పీ కృపామణి, పీవీ భద్రం, హరినాథ్, నవీన్, ఎస్కే ముక్తర్ అహ్మద్, బి.రమేష్, విజయలక్ష్మి, ఎస్‌కే నస్రీన్, సుల్తానా, యాదమ్మ, నరసింహా, కవిరాజు పాల్గొన్నారు.

సింగరేణి డైరెక్టర్ బలరామ్‌కు సన్మానం


బలరామ్‌ను సన్మానిస్తున్న ప్రైవేట్ ఉద్యోగుల సంఘం నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ప్రధాన కార్యాలయంలోని డైరెక్టర్(పా) ఎన్.బలరామ్‌ను తెలంగాణ ప్రైవేట్ ఎంప్లాయిస్ యూనియన్ (టీపీయూఎస్) రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చింతమల్ల తిరుపతి శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. సింగరేణిలో డైరెక్టర్(పా) మరోసారి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయన చాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ.. పేద కుటుంబంలో జన్మించి కష్టపడి సంస్థలో ఎంతో పాముఖ్యత కలగిన డైరెక్టర్ ఫైనాన్స్, డైరెక్టర్ పోస్టులు ఎంతో విషయ పరిజ్ఞానం ఉంటే తప్ప సాధ్యం కాదన్నారు.

26న కొత్తగూడెం క్లబ్‌లో వైద్యశిబిరం


మాట్లాడుతున్న డాక్టర్ కృష్ణయ్య

కొత్తగూడెంఅర్బన్: ఈనెల 26న కొత్తగూడెం క్లబ్‌లో జరగనున్న ఆరోగ్య సదస్సును విజయవంతం చేయాలని ప్రకృతి ఆశ్రమం సలహాదారు, డిగ్రీ కళాశాల మాజీ ప్రిన్సిపల్ డాక్టర్ బి.కృష్ణయ్య అన్నారు. శనివారం స్వర్ణ భారతి పాఠశాలలో జరిగిన సదస్సు నిర్వహణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో స్వయం ప్రతిబంధక వ్యాధులతో పాటు, తాగునీరు, ఆహారం, గాలి, వాతావరణ కాలుష్యం, కెమికల్ ఫుడ్ ద్వారా వచ్చే వ్యాధులపై, పోస్ట్ కోవిడ్ సమస్యలపై సంబంధిత శాఖల వైద్యులు అవగాహన కల్పిస్తారని చెప్పారు. హైదరాబాద్, మహబూబ్‌నగర్, వరంగల్, విజయవాడ, గుంటూరులకు చెందిన అల్లోపతి ఇతర వైద్య విధానాల సీనియర్ వైద్యులు, ప్రొఫెసర్లు పాల్గొంటారని తెలిపారు. కొత్తగూడెం మున్సిపల్ గ్రీన్ అంబాసిడర్, పర్యావరణవేత్త, మొక్కల వెంకటయ్య, ప్రకృతి ఆశ్రమం నిర్వాహకులు కేహెచ్ ప్రసాద్, కోఆర్డినేటర్ సుగుణారావు, ప్రకృతి ఆశ్రమం సభ్యులు, స్వర్ణ భారతి పాఠశాల ప్రిన్సిపాల్ కె.శైలజ, బి.శంకర్, కె.శ్రీదేవి, స్వామి పాల్గొన్నారు.

నేడు సింగరేణి యూనియన్ల సదస్సు

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 12వ తేదీన సాయంత్రం 5 గంటలకు సింగరేణి పరిరక్షణ, కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనానికై సింగరేణి ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించనున్నట్లు హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్, ఏఐఎఫ్‌టీయూ గౌరవాధ్యక్షురాలు విమలక్క, హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్, ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షులు టి.శ్రీనివాస్, టీఎస్‌యూఎస్ రాష్ట్ర కన్వీనర్ కామెర గట్టయ్య, ఇఫ్టూ రాష్ట్ర నాయకులు కే.విశ్వనాథ్, ఎస్‌జీకేఎస్ రాష్ట్ర నాయకులు మహేందర్, టీఎన్‌టీయూసీ నాయకులు పాల్గొననున్నట్లు తెలిపారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి


మాట్లాడుతున్న ముత్యాల విశ్వనాథం

పాల్వంచ: అనేక సంవత్సరాలుగా పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని సీపీఐ నిర్వహించిన పోరాట ఫలితంగా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటన చేయడాన్ని స్వాగతిస్తున్నామని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం అన్నారు. శనివారం స్థానిక సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం వాయిదా వేయకుండా పట్టాలు వెంటనే అందించాలని కోరారు. లేదంటే ఉద్యమాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, బండి నాగేశ్వరరావు, గుండాల నాగరాజు, వీసంశెట్టి విశ్వేశ్వరరావు, వేముల వెంకటేశ్వర్లు, గూడెపూరి రాజు, శ్రీను, పాషా, రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



రోడ్డు నిర్మాణం ఎప్పుడో..?



టేకులపల్లి మండలం దాసుతండా పంచాయతీ సింగ్యా తండా - హనుమా తండా రోడ్డు నిర్మాణం ప్రారంభి ఆరేళ్లయినా పూర్తి కావడం లేదు. గిరిజన సంక్షేమ శాఖ 2016 లోనే 2 కిలోమీటర్ల బీటి రోడ్డుకు రూ.2 కోట్లు మంజూరు చేసింది. కేవలం కల్వర్టులు మాత్రమే పూర్తి చేశారు. వర్షం పడితే బురదతో నానా అవస్థలు. రోడ్డుకు రెండు వైపులా కందకాలు తవ్వడంతో రోడ్డుపై గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. రైతులు, ఇతరులు అదుపు తప్పి ప్రమాదాలకు గురైన సంఘటనలూ ఉన్నాయి. కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యం కారణంగా స్థానికులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బీటి రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని కోరుతున్నారు. - టేకులపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి : సలార్, ఏఈ, ఐటీడీఏ టేకులపల్లి
సెల్ నంబర్ : 9701619970